సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 13-3-2025
సంపుటి: 20 సంచిక: 297
పేజీలు: 8 వెల: రూ.1

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్‌లు పంపిణీ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

స్థానిక బలగ ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు పరీక్ష అట్ట, పెన్ను, పెన్సిల్, స్కేల్, రబ్బరు, షార్పనర్ కిట్‌ను నగరానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు అందజేశారు. మార్చి 17న పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన కనకరాజు 76 మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లు అందజేశారు. ఈ పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత చదువులకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, బరాటం భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'గ్రీష్మ'ంలో రాజకీయ వసంతం!

- కలిసివచ్చిన అధినేత రాజకీయ అవసరాలు
- కొందరికి చెక్ పెట్టేందుకు అనూహ్యంగా తెరపైకి కావలి పేరు
- బీజేపీ నుంచి వీర్రాజు ఎంపికలోనూ చంద్రబాబు ఎత్తుగడ అదే
- జిల్లా.. అటు రాష్ట్రంలో చర్చనీయాంశంగా వీరిద్దరి ఎంపిక



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

రాష్ట్రంలో శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఎమ్మెల్సీగా గెలుపొందినవారి పేర్లు ప్రకటించడం కేవలం లాంఛనమే. ఇందులో నాగబాబు, బీద రవిచంద్ర, బీటీ నాయుడుల అభ్యర్థిత్వాలపై చర్చ లేదు. కేవలం టీడీపీ నుంచి కావలి గ్రీష్మ, బీజేపీ నుంచి సోము వీర్రాజుల పేర్లను ఆ పార్టీలు ఖరారు చేయడంపైనే పెద్ద చర్చ నడుస్తోంది. ఇందుకు ప్రత్యేకమైన కారణాలు ఉన్నాయి. వీరిద్దరి ఎంపిక ద్వారా ఇటు టీడీపీ, అటు బీజేపీ ఉగాది తర్వాత కొత్త సంకేతాలు ఇవ్వనున్నాయనడంలో సందేహాలు లేవు. 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం వల్ల కుల, ప్రాంత సమీకరణాల రీత్యా మంత్రివర్గ కూర్పును వీలైనంత వివాద రహితంగా చంద్రబాబునాయుడు చేపట్టారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి నేటివరకు మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాడు అన్న భరోసా ఇవ్వాలని పెట్టుబడిదారులందరూ కోరుతున్నట్లు చంద్రబాబు పదే పదే చెప్పుకొస్తున్నారు. వైకాపా మళ్లీ అధికారంలోకి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుదే. ఒకవైపు అమరావతి పూర్తికావాలన్నా, మరోవైపు వైకాపా అధికారంలోకి రాకుండా ఉండాలన్నా 2029 గానీ, అంతకు ముందే జరిగే అవకాశమున్న జమిలీ ఎన్నికల్లో గానీ కూటమే అధికారంలోకి రావాలి. అలా రావాలంటే ప్రభుత్వం ఎక్కడికక్కడ సెల్ఫ్ చెక్ చేసుకోవాలన్న భావనలో ఉంది.

### ప్రత్యర్థినే ఆయుధంగా చేసుకునే ఎత్తుగడ

ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న కొందరి పనితీరుపై చంద్రబాబు పూర్తి అసంతృప్తితో ఉన్నారు. అలా అని ఇప్పటికిప్పుడు వారికి ప్రత్యామ్నాయంగా వేరేవారిని తీసుకొచ్చి మంత్రి పదవి ఇవ్వడానికి కొన్నిచోట్ల సమీకరణాలు కుదరడంలేదు. అందుకే ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల భర్తీలో తెరపైకి వచ్చిన రెండు పేర్లు చూసి అందరూ ఉలిక్కిపడ్డారు. పార్టీ పట్ల విధేయత, చంద్రబాబు నాయకత్వం మీద విశ్వాసంతో ఉంటూ కేబినెట్‌కు ప్రాతినిధ్యం వహించగల సామర్థ్యం ఉన్న అభ్యర్థుల వైపే చంద్రబాబు చూశారు. ఇందులో బీజేపీ తరపున సోము వీర్రాజు పేరును ఆ పార్టీ సూచించకపోయినా స్వయంగా చంద్రబాబే ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ అగ్రనేతల దృష్టికి తీసుకువెళ్లారని భోగట్టా. 2019-24 మధ్యలో చంద్రబాబుపై విరుచుకుపడిన సోము వీర్రాజుకు ఎమ్మెల్సీగా ఎలా అవకాశమిస్తారని తెలుగుదేశం నేతలు విమర్శిస్తున్నా సబ్జెక్టు మీద మాట్లాడటంలో ఎక్స్‌పర్ట్‌గా పేరొందిన వీర్రాజును సానబట్టి వైకాపా మీదకు వదలడానికి, అదే సమయంలో ఇప్పటికీ కేంద్రంతో జగన్మోహన్‌రెడ్డికి ఉన్న బంధాన్ని తెగ్గొట్టడానికి వీర్రాజు ఉపయోగపడతారని భావించడం వల్లే చివరి నిమిషంలో ఆయనకు అవకాశం కల్పించి రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని చంద్రబాబు మరోసారి నిరూపించారు. అక్కడికి రెండు రోజుల ముందే చంద్రబాబు తోడల్లుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును 30 ఏళ్ల తర్వాత ఒకే వేదిక మీద కలిసి ఆయన రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

### చంద్రబాబు చాణక్యం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత జిల్లాలో ప్రతిభాభారతిది ఒక చరిత్ర. ఆమె ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్సీగా పని చేశారని మాత్రమే ఈ తరానికి తెలుసు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన గ్రీష్మ కుటుంబంలో మూడు తరాల నుంచి ఎమ్మెల్యేలున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం జనరల్ మారడం, రాజాం నియోజకవర్గంలో కోండ్రు మురళీకి అవకాశం కల్పించడం వల్ల ప్రతిభాభారతి కుటుంబం గత కొన్ని ఎన్నికలుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైపోయింది. కానీ జిల్లాలో తెలుగుదేశం శ్రేణుల్లో ఎచ్చెర్ల, రాజాం ప్రాంతాల్లో ప్రతిభాభారతి ఇమేజ్ ఇంకా తగ్గలేదు. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి గ్రీష్మకు కార్పొరేషన్ చైర్మన్ పోస్టు ఇచ్చారు. ఇక్కడితో ప్రతిభాభారతి కుటుంబానికి రాజకీయ అవకాశాలు సరి అనేవారు కొందరున్నా ఎక్కడైనా గవర్నర్ పోస్టుకు ప్రతిభాభారతిని సిఫార్సు చేస్తారని ఆమె అభిమానులు భావించారు. ఈ రెండింటిలోనూ వాస్తవాలున్నాయి. అర్ధసత్యాలూ ఉన్నాయి. 2029 ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలించిన చోట తన కుమార్తె గ్రీష్మకు టికెట్ వస్తే చాలని ప్రతిభాభారతి భావించారు. అనూహ్యంగా ఎమ్మెల్సీ నామినేషన్‌కు రెండు రోజుల ముందు ప్రతిభాభారతిని పిలిపించిన చంద్రబాబునాయుడు అశోక్‌గజపతి రాజుతో కలిపి సుదీర్ఘ చర్చలు జరిపారు. కట్ చేస్తే.. - మిగతా చివరి పేజీలో

## జీవనశైలి మార్పుతో
# కిడ్నీ వ్యాధికి దూరం




**-జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కిడ్నీ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దాని బారిన పడకుండా ఉండేందుకు జీవనశైలి మార్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జీజీహెచ్ వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మరో ఐదు డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయనున్నట్లు వివరించారు. కిడ్నీ వ్యాధిని త్వరగా గుర్తించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం కిడ్నీ పరీక్షలు చేయిస్తే మొదటి దశలోనే వ్యాధిని గుర్తించవచ్చని, అప్పుడే చికిత్స సులభం అవుతుందని వివరించారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి రెండో వారంలో కిడ్నీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఆల్కహాల్, పొగ తాగడం ఆపాలని, జీవన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కిడ్నీ వ్యాధికి ప్రధాన కారణం షుగర్, హైపర్ టెన్షన్‌లేనన్నారు. 60 శాతం కిడ్నీ వ్యాధులు వీటి వల్లే వస్తున్నాయన్నారు. పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడటం వల్ల కూడా కిడ్నీ వ్యాధి వస్తుందన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి వేరే కారణాలు ఉన్నట్లు పరిశోధనలో తేలిందన్నారు. ఈ ప్రాంత ప్రజల్లో కిడ్నీ వ్యాధి లక్షణాలు కనబడవని, కాళ్ల వాపులు, అలసట, తదితర లక్షణాలు ఉండవన్నారు. అనుమానం వచ్చి పరీక్షలు చేస్తే క్రియాటినైన్ 3 లేదా 4 ఉంటుందని చెప్పారు. డీసీహెచ్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ షకీలలు మాట్లాడుతూ జిల్లాలో 106వరకు డయాలసిస్ యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 12 రకాల మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 580 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శరత్ జ్యోత్స్న, అన్ని విభాగాల వైద్యులు, మెడికల్ కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# నమ్మండి..
## ఇవి కార్పొరేషన్ రోడ్లేనండి!



**ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు సాక్షాత్తు నగర పాలక కార్పొరేషన్ పరిధిలోనిదే అనేకంటే జిల్లా ప్రధాన కేంద్రంలోనిదే అని చెప్పాలి. ఇంకా గుండె పగిలే వాస్తవం ఏమిటంటే.. నగరంలో ఏ మూలో ఉన్న కాలనీలోనిది కాదు. జీటీ రోడ్డు నడిబొడ్డులో సూర్యమహల్, చంద్రమహల్ పేర్లు చెబితే గుర్తుపడతారు కదా..! సాక్ష్యాత్తూ వాటి ముంగిట ఉన్న రోడ్లే ఇవి. 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉడా నిధులతో ఫుట్‌పాత్‌లు నిర్మించారు. శ్రీకాకుళమేంటి? ఫుట్‌పాత్‌ల మీద నడిచే జనాలెవరు? అనే ఆలోచనే లేకుండా రోడ్డుకు అటూ ఇటూ వీటిని నిర్మించడం వల్ల రోడ్డు మీద నీరు కాలువలోకి వెళ్లక, కాలువలో ఉన్న షిల్ట్ ఎత్తలేక స్వయంగా చంద్రమహల్ ప్రధాన గేటు వద్దే కాలువ, రోడ్డు కలిసి ఉన్న దృశ్యమిది. కాలాలతో సంబంధం లేకుండా దోమలకు స్వర్గధామమైన శ్రీకాకుళం నడిబొడ్డు జీటీ రోడ్డులోనే మురుగు నీరు రోడ్డు మీద నిల్వ ఉంటే ఏమనుకోవాలి?! థియేటర్‌లోకి వెళ్లడానికి కాలువలు, ఫుట్‌పాత్‌ల మీదుగా ర్యాంపులు నిర్మించడంతో వీటిని తొలగించి షిల్టులు తీసే యంత్రాంగం కార్పొరేషన్‌లో లేదు. రోడ్డు వాటం ఎటుంది? కాలువ ఎత్తు ఎంతుంది? అనే ఇంజినీరింగ్ అంచనాలు లేకుండానే శ్రీకాకుళంలో రోడ్లు, కాలువలు నిర్మిస్తుంటారు. ఇక్కడ కాంట్రాక్టరే కింగ్. అది ఏ పార్టీ అయినా అనవసరం. ఇందుకు ఒక ఉదాహరణ చూద్దాం.**

కళింగ రోడ్డు వెడల్పు చేసినప్పుడు కాలువలు నిర్మించే కాంట్రాక్ట్‌ను ఒకరు దక్కించుకున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా అతి పెద్ద రాయిని ఈ కాలువ నిర్మాణానికి వాడారు. రోడ్డు మీద కుప్పలుగా వేసిన బండల్లాండి రాళ్లు చూసిన అప్పటి కలెక్టర్ విష్ణు ఇలా చేస్తే బిల్లులు చెల్లించమని, బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించినా అదే రాళ్లతో, అదే కాంట్రాక్టర్ కాలువలు నిర్మించారు. విచిత్రమేమిటంటే.. అందరి కంటే ముందు బిల్లులు తెచ్చుకున్నారు.

స్థానిక ఉమెన్స్ కాలేజీ రోడ్డు మెయింటినెన్స్ వర్క్ జరిగిందని, అది నాశిరకంగా ఉందని తెలుసుకున్న కింజరాపు ఎర్రన్నాయుడు ఆ రోడ్డు పరిశీలనకు వెళ్లి రోడ్డు పక్కన పడివున్న ఎండుపుల్లను పట్టుకొని రోడ్డును గుచ్చితే పెచ్చులు రావడం మీడియా ప్రముఖంగా ప్రచురించింది కూడా. ఇక్కడా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. శ్రీకాకుళంలో ఏ కాలువా సునాయాసంగా ప్రవహించడానికి వీలుగా వాటంతో ఉండదు. ఏ రోడ్డూ కాలువతో అనుసంధానమై ఉండదు. అటువంటి చోట ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే అసలు రోడ్డు మీద నీరు కాలువలోకి పోదు. దాని ఫలితమే కాలువల్లో చెత్త పేరుకుపోవడం, రోడ్డు మీద నీరు నిల్వ ఉండటం.







**ఈ ఫొటో స్వయంగా రైతుబజార్ జంక్షన్ వద్దది. సీసీ రోడ్డు ముక్కలైపోయి ఇక్కడ ప్రయాణిస్తున్నవారి వెన్ను విరగ్గొడుతుంది. కాలువ మీద ఉన్న పలకలకు, రోడ్డుకు మధ్య కనెక్షన్ తెగిపోవడంతో ఈ రోడ్డు నుంచి అవతలివైపు వెళ్లడానికి వాహనదారులు నానా యాతన పడుతున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో అయితే ఫర్వాలేదు. స్వయంగా నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు 40 ముక్కలైపోయినా ఎక్కడా కొత్త రోడ్డుకు ప్రతిపాదించిన నాథుడే లేదు. ఎందుకంటే.. ఇప్పటి జనరేషన్‌కు ఊహవచ్చిన దగ్గర్నుంచి కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో, ఎవరు ఏ పార్టీ ఇన్‌ఛార్జో వారికే తెలియదు. ఇక మున్సిపల్ యంత్రాంగం కోసం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.**

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

• ఎడిటోరియల్

# తెలుగును తాకట్టు పెట్టిన 'దేశం'

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం న్యూఢిల్లీలో 'ఇండియా టుడే' సదస్సులో మాట్లాడిన తీరు బాగుంది. ఒక రాష్ట్రానికి, ఒక ప్రాంతానికి, ఒక పార్టీకి, కొన్ని విలువలకు ప్రతినిధిగా ఆయన మాట్లాడారు. మాట్లాడిన విషయం మీద తనకు నిబద్ధత ఉన్నదని, ఆ మాటలను నమ్మి చెబుతున్నారని చూసినవారికి, విన్నవారికి అనిపించేటట్టుగా ఆయన మాట్లాడారు. ముఖ్యమైన విధాన విషయంలో మోదీ ప్రభుత్వం మీద తన ప్రతిఘటనా వైఖరిని ప్రకటించారు. బీజేపీ అగ్రనాయకత్వం విషయంలో మెతకగా ఉంటున్నారని, లోపాయికారీగా వారితో సత్సంబంధాలు పెట్టుకుంటున్నారని ప్రతిపక్షం ఆరోపిస్తున్న సమయంలో తాజాగా, రెండు శాసనమండలి స్థానాలను అనాలోచితంగానో, అసమర్థత వల్లనో బీజేపీకి వదిలేశారని విమర్శలు వస్తున్న కాలంలో రేవంత్ ఈ తీవ్రమైన విమర్శలు చేయడం విశేషం. దక్షిణాదికి వ్యతిరేకంగా బీజేపీ కుట్ర చేస్తున్నదని అనడం చిన్న ఆరోపణ కాదు. మోదీ గుజరాత్ దూత అయితే, తాను తెలంగాణ దూతనని అనడం పెద్దమాటే. అయితే తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికో, కేంద్రంతో తనకు ఏ లాలూచీ లేదని ప్రదర్శించుకోవడానికో రేవంత్ ఈ ధాటి చూపించారని కూడా కొందరు అనుకోవచ్చు, కేసీఆర్‌ను ఢీకొనడానికి తీవ్రమైన విమర్శా ధోరణిని, దూషణల భాషను ఆశ్రయించారు. కాంగ్రెస్‌వాదిగా మారిపోయి, ముఖ్యమంత్రి స్థానం సంపాదించుకున్నారు. వివిధ అంశాల మీద కాంగ్రెస్ విధానాలు వైఖరులను స్వీకరించే ప్రయత్నం చేస్తూ వచ్చారు. అదే సమయంలో ఈ దేశంలో ఎవరి మీదా ఏ భాషనూ రుద్దలేరు, డీలిమిటేషన్ జరగదు, జరిగినా మేం ఎన్డీయే మీటింగ్‌లో మాట్లాడుకుంటాం అని లోకేశ్ మాటలు, తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ న్యాయ సిద్ధాంతాన్ని, మాతృభాషాభిమానాన్ని విసర్జించినట్టు సూచిస్తాయి. ఎన్డీయేలోకి తెలుగుదేశం, పిల్లిలో ఎలుక ఐక్యమైనంత గాఢంగా కలిసిపోయిందని అర్థమవుతోంది. అందుకు భిన్నంగా, రేవంత్ రెడ్డి ప్రకటించిన వైఖరి, తెలంగాణ రాష్ట్రసమితి మొదటి దఫా పాలన తర్వాత, దాదాపు ఏ సైద్ధాంతిక స్పర్శా లేకుండా నిస్సారంగా ఉండిపోయిన తెలంగాణకు తిరిగి కొత్త జీవాన్ని అద్దింది. తమిళనాడు చొరవ కారణంగా దేశవ్యాప్తంగా చర్చలోకి వచ్చిన డీలిమిటేషన్ అంశంలో, హిందీ విధింపు విషయంలో తెలంగాణ గొంతును కూడా వినిపించడం విశేషం. ఎంకే స్టాలిన్ ఏర్పాటు చేసే దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష సమావేశానికి తాను హాజరవుతానని రేవంత్ చెప్పారు. భారతదేశ రాజకీయాలలో అనివార్యంగా రూపొందుతున్న ఉత్తర, దక్షిణ సమీకరణల్లో కాంగ్రెస్ పాలిత రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోక తప్పదు. డీలిమిటేషన్ విషయంలో తన వైఖరి ఏమిటో చెప్పడానికి రాష్ట్ర బీజేపీకి అనేక పరిమితులున్నాయి. సమాధానం చెప్పలేని బలహీనతలో ఆ పార్టీ పడిపోయే అవకాశం ఉంది. మరి, బీఆర్ఎస్? డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని ఆ పార్టీ ఇంతకు మునుపు అభ్యంతరపెట్టింది కానీ ఆ అంశం మీద రాష్ట్ర అధికార పార్టీతో కలిసి, దక్షిణాది కూటమితో కలిసి పోరాడుతుందా? లేక తాను విడిగా వ్యతిరేకతను చెబుతానంటుందా? ఫెడరలిజాన్ని మరింతగా దెబ్బతీసే డీలిమిటేషన్ మీద గట్టి వైఖరి తీసుకుని ప్రతిఘటించకుండా ఉండడం ప్రాంతీయపార్టీకి సాధ్యం కాదు. ఇదే సదస్సులో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. డీలిమిటేషన్ వివాదం అంతా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డిఎంకె సృష్టిస్తున్నదన్నట్టుగా ఆయన మాట్లాడారు. జనాభా నియంత్రణ పాటించినందువల్ల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోవడం న్యాయం కాదన్నది అంగీకరిస్తూనే, ప్రస్తుత నిష్పత్తులకు ఏ భంగమూ రాదని అమిత్ షా చెప్పారు కదా అని అన్నారు లోకేశ్. నిజానికి, అమిత్ షా అటువంటి నిర్దిష్టమయిన వాగ్దానం ఏదీ ఇవ్వలేదు. దక్షిణాది రాష్ట్రాలకు ఒక్కసీటు కూడా తగ్గదని మాత్రమే అమిత్ షా అన్నారు. తగ్గుతుందని కాదు కదా, ఇప్పటి కలవరం? ఉత్తరాది రాష్ట్రాలకు పెరిగినంతగా పెరగకపోవడం వల్ల రెండు ప్రాంతాలకు మధ్య ఉన్న నిష్పత్తి చెదిరిపోతుందని, 24 శాతం ఉన్న దక్షిణాది లోక్‌సభ ప్రాతినిధ్యం 19కు, అంతకంటే దిగువకు పడిపోతుందని కదా ఆందోళన! 1971 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేయడమో, లేదా, ఇప్పటి లోక్‌సభ లోని రాష్ట్రాల ప్రాతినిధ్యం నిష్పత్తిలోనే పెంచే సీట్లను నింపడమో, లేదా నిరవధికంగా డీలిమిటేషన్ ను వాయిదా వేయడమో, మరేదైనా ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడమో జరిగితే తప్ప, అన్యాయాన్నినివారించలేము. హిందీ విధింపు కానీ, ప్రస్తుత జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ కానీ దక్షిణాదికి కీలకమయిన సమస్యలైనప్పుడు, ఒక రాష్ట్రంలో ఒక పార్టీ దాని ఆధారంగా ఎన్నికల పోరాటం చేస్తే తప్పేమిటి? ఆ పార్టీకి మిత్రపక్షమయిన తెలంగాణ కాంగ్రెస్ ఆ పోరాటంలో భాగస్వామి అయితే పొరపాటేమిటి?



# క్రికెట్ ఆయనను వదలలేదు!

**ఛాంపియన్స్ ట్రోఫీ (ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ) లో టీమ్ఇండియా ట్రంప్ కార్డు వరుణ్ చక్రవర్తి గురించే ఇప్పుడు అంతటా చర్చ. తన స్పిన్ మాయా జాలంతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసి జట్టు విజయా ల్లో కీలకంగా నిలిచాడు. అక్షర్‌పటేల్, రవీంద్ర జడేజా, కుల్ దీప్ లాంటి సీనియర్ స్పిన్నర్లున్నా.. తుది జట్టులో వరుణ్‌కు చోటు దక్కిందంటే అతడి సామర్థ్యం ఏంటో అర్థం చేసుకోవచ్చు. అయితే.. ఈ మిస్టరీ స్పిన్నర్ క్రికెట్ కెరీర్ మాత్రం ఆరంభంలో అంత సులు వుగా సాగలేదు. అతడి గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందామా..?**

ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో వరుణ్ చక్రవర్తికి టీమ్ఇండియా తరఫున ఆడే అవకాశం దక్కింది. అయితే.. అతడు కాస్త భయస్తుడు. 2021 టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్నప్పుడు.. తనకు ఎలాంటి ఫీల్డ్ సెట్ కావాలో కెప్టెన్ విరాట్ కోహ్లీకి చెప్పడానికి కూడా వరుణ్ భయపడినట్లు మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ వెల్లడించాడు. తనకు ఇచ్చిన ఫీల్డ్ సెట్‌తోనే బౌలింగ్‌ను పూర్తి చేశాడని గుర్తు చేసుకున్నాడు.

ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా క్రికెట్‌లోకి వచ్చిన వరుణ్.. ఆరంభంలో ఉదయం 9 గంటల 5 గంటల వరకు జాబ్ చేసేవాడు. టెన్నిస్‌బాల్‌తో క్రికెట్ ఆడేవాడు. ఐపీఎల్‌లోకి రాకముందు తమిళనాడు ప్రీమియర్ లీగ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.


సెలక్షన్ టైమ్‌లో ఆడిన అతడు కొన్నాళ్లు క్రికెట్‌కు విరామం ఇచ్చి ఇతర రంగాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. చివరికి మళ్లీ క్రికెట్‌నే కెరీర్‌గా ఎంచుకోవాల్సి వచ్చిందని తనే తెలిపాడు. "నేను చెన్నై చెపాక్ స్టేడియంలో చాలా సెలక్షన్ మ్యాచ్‌లు ఆడాను. కానీ, ఒక్కసారి కూడా ఎంపిక కాలేదు. స్కూలింగ్ తర్వాత క్రికెట్ ఆడటం ఆపేశా. ఆర్కిటెక్చర్, మూవీ మేకింగ్.. ఇలా విభిన్నంగా ప్రయత్నించాలని భావించా. చివరికి మళ్లీ క్రికెట్‌నే కెరీర్‌గా ఎంచుకోవాల్సి వచ్చింది. అందుకే, నేను క్రికెట్‌ను వదిలేద్దామనుకున్నా.. ఆటే నన్ను వదలట్లేదని చెబుతా" అని గతంలో వరుణ్ సరదాగా స్పందించాడు.

క్రికెట్‌లోకి రాకముందు ఓ తమిళ సినిమాలో వరుణ్ చక్రవర్తి ఓ చిన్న పాత్రలో నటించాడన్న విషయం మీకు తెలుసా..? అవును విష్ణు విశాల్ హీరోగా నటించిన 'జీవా' చిత్రంలో వరుణ్ అతిథి పాత్రలో మెరిశాడు. ఆటను విడిచిపెట్టి కష్టాల్లో ఉన్న క్రికెటర్ జీవితం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది.

కెరీర్ ఆరంభంలో వరుణ్ యో-యో కష్టాలను ఎదుర్కొన్నాడు. 26 సంవత్సరాల వయసులో అతడు 9-5 జాబ్‌కు వెళ్లేవాడు. దీంతో జిమ్‌కు వెళ్లే సమయం అతడికి దొరికేది కాదు. "క్రికెట్‌లోకి వచ్చిన తర్వాత మొదటి మూడేళ్లు ఫిట్‌నెస్ టెస్టులో ఫెయిల్ అయ్యాను. నీకు రేపు యో-యో టెస్టు ఉందని ఎవరైనా చెబితే.. ఇక ఆరోజు నిద్ర పట్టేది కాదు.. భయాందోళనకు గురయ్యేవాడినని" వరుణ్ ఇటీవల వెల్లడించాడు.

**- రాజు శ్రీరాం పల్లేరుముడి -**

## వైకాపా యువత ఫీజు పోరు..
# నేతి బీరకాయలు చందమే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా చేపట్టిన యువతపోరు 'నేతి బీరకాయ' చందమే నని టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ విమర్శించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేతి బీరకాయల్లో నెయ్యి ఉంటుందని అనుకోవడం ఎంత నిజమో.. యువత పోరుకు యువత వచ్చారన్నది కూడా అంతే నిజమన్నారు. వైకాపా చెత్తపాలన పోరు పడలేక ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్న విషయాన్ని మరిచిపోకూడదన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేలకోట రూపాయల ఫీజులను బకాయిపెట్టి ఇప్పుడు వైకాపా యువత పోరు అని చెబితే నమ్మే స్థితిలో యువత లేరన్నారు. వైకాపా అధికారం కోల్పోయాక వారి మీద వారికే నమ్మకం లేకుండా పోయిందన్నారు. ముందు "ఫీజుపోరు" అన్నారని, తర్వాత "యువత పోరు" అంటూ మొక్కుబడి, నమ్మకం లేని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరు పదవుల కోసమే తప్ప ప్రజల కోసమో యువత కోసమో కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అదే నిజమైతే అధికారంలో ఉండగా ఎందుకు ఫీజు రియంబర్స్మెంట్ విద్యార్థులకు వేలకోట్లలో బకాయి పెట్టారని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన వెంటనే నెలల వ్యవధిలోనే వందల కోట్ల బకాయిల తీర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కరెంటు చార్జీలు తొమ్మిదిసార్లు పెంచిన వైకాపా దుర్మార్గపు పాలన చేసి ఇప్పుడు దొంగ ధర్నాలు చేస్తూ రోడ్డెక్కుతుందన్నారు. అన్నివర్గాలను ఆదుకుని అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు షాకులు కొట్టి వారు మాత్రం షోకులు, విలాసాలతో ఆకాశంలో విహరిస్తూ ప్యాలెస్‌లలో ఉండేవారన్నారు. వైకాపా హయాం మొత్తం ప్రజాకంటక పాలనేనన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రమే ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం విశేష కృషి జరుతున్నారని, వారికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా తనవంతు పాత్ర పోషించడం హర్షణీయమన్నారు. కూటమి ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.




# ఆమె మెడ వంచి, తాళికి మూడు ముళ్లు వేసేస్తే..
# ఇది పెళ్లంటారా..?

**ఏది పెళ్ళి ? కేవలం మూడు ముళ్ళు వేయటమేనా ? లేక కడదాకా భార్యను ప్రేమగా చూసుకోవటమా ? నాదిగా వస్తున్న ప్రశ్నలే ఇవి. భర్త మగాడు ఇద్దరు పెళ్ళాలతో ఊరేగేటప్పుడు, భార్య ఆడది ఇద్దరు మొగుళ్ళతో ఎందుకు ఊరేగకూడదు? ఈ ప్రశ్ననే ఈ సినిమాలో రెండు పాత్రలు ప్రశ్నిస్తాయి. ఉండేది కాసేపే అయినా ఈ రెండు పాత్రల్లో నటించిన సువర్ణను, ఝాన్సీని ప్రేక్షకుడు మరవ లేడు.**

సప్తపది సినిమాలో విశ్వనాథ్ ఒక రకమైన ముగింపు ఇస్తే, రాధాకల్యాణం సినిమాలో బాపు/భాగ్యరాజ్ మరో రకమైన ముగింపు ఇచ్చారు. ఆ రెండు సినిమాలు పెళ్లి, తాళిబొట్టు చుట్టూనే తిరుగుతాయి. ఈ ఇది పెళ్ళంటారా సినిమా కూడా పెళ్లి, తాళిబొట్టు చుట్టూనే తిరుగుతుంది. సంచలనాత్మక కథతో వచ్చిన మంచి సినిమా. కానీ బొబ్బిలి పులి ప్రభంజనంలో తట్టుకోలేక పోయింది. న్యాయం కావాలి సినిమాలో నిరసనగా పెళ్లి అక్కరలేదు పొమ్మని చెపుతుంది హీరోయిన్ రాధిక. ఈ సినిమాలో సేడిస్ట్ మొగుడు మొహాన తాళిబొట్టు విసిరేసి వెళ్ళిపోయి, విడాకులు తీసుకోకుండా మరో వ్యక్తిని వివాహం చేసుకుంటుంది హీరోయిన్. సేడిస్ట్ మొగుడుగా వికెడ్ సాఫ్ట్ విలన్ పాత్రలో గొల్లపూడి మారుతీరావు బాగా నటించారు. ప్రేక్షకులకు లేచి తన్ని వద్దామని అనిపిస్తుంది. అంత క్రూరంగా నటించారు. కథానాయకి రాధిక చాలా బాగా నటించింది. చిరంజీవి చాలా హుషారుగా, ఆదర్శవంతుడైన భర్తగా, భర్తంటే ఎలా ఉండాలో అలాగా బాగా నటించారు. ఇతర ప్రధాన పాత్రల్లో ప్రభాకరరెడ్డి, వుయ్యూరు రామకృష్ణ, మల్లికార్జునరావు, పి.జె. శర్మ ప్రభృతులు నటించారు. సాధారణంగా మన సినిమాలు 1+2. ఈ సినిమా 2+1. అంటే ఒక హీరోకి ఇద్దరు హీరోయిన్లను చూపే మన సినిమాలలో ఈ సినిమా ఒక హీరోయిన్ ఇద్దరు భర్తలు. పెళ్ళి ఎలా ఆవిర్భవించిందో చెప్పటంతో టైటిల్స్ ప్రారంభం అవుతాయి. ముగింపు కూడా వాయిస్ ఓవర్‌తోనే ముగిస్తుంది. ఈ సినిమాకు గుండెకాయ కోర్ట్ సీన్. ఎందుకనో పేలవంగా ఉందని అనిపిస్తుంది. న్యాయం కావాలి సినిమా లాగా సూపర్ హిట్ కాకపోవటానికి ఇది కూడా కారణం కావచ్చు. క్రాంతికుమార్ నిర్మాత. విజయభాస్కర్ దర్శకుడు. సత్యానంద్ డైలాగులు సినిమా అంతా పదునుగా ఉన్నా కోర్ట్ సీన్లో పస లేకుండాపోయాయి. చక్రవర్తి సంగీతం శ్రావ్యంగా ఉంటుంది. పాటలు బయట హిట్ కాకపోయినా థియేటర్లో శ్రావ్యంగా ఉంటాయి. ముఖ్యంగా నా ఊపిరికే పరిమళమా నా పూజకు తులసీ దళమా, వసంతం శరత్తు హేమంతం పాటలు చాలా శ్రావ్యంగా, అందంగా ఉంటాయి. పాటల్ని అన్నీ వేటూరే వ్రాసారు. హరినారాయణా హరి నారాయణా అనుకోరాదా మనసా అనే పాట అనంత శ్రీరాంకు గుర్తు లేకపోవటం వలన బతికిపోయింది కానీ లేకపోతే హైందవ శంఖారావం మీటింగులో కడిగి పారేసేవాడు.

1982 జూలై 16న వచ్చిన ఈ సినిమా చూడబుల్ సినిమాయే. చక్కని, శుభ్రమైన సంచలనాత్మక సందేశాత్మక ఈ సినిమా యూట్యూబులో ఉంది.

**- దోగిపర్తి సుబ్రమణ్యం**





**కేతికాశర్మ ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు ఆత్మవిశ్వాసం, ఆకర్షణను ప్రసరింపజేస్తాయి, ప్రతి షాట్‌లో ఆమె శక్తివంతమైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణ దుస్తుల నుండి ఆకర్షణీయమైన దుస్తుల వరకు, ఆమె పోస్ట్‌లు సెక్సీగా అందాన్ని ప్రదర్శిస్తాయి. ప్రతి చిత్రం చక్కదనం, వినోదం మిళితమై ఉంటుంది.**

# స్థాయిని తగ్గించకుండా వుంటే చాలు!!

చిరంజీవి సినిమాలలో సినిమా బాగుండి ఫెయిల్ అయిన సినిమాలలో "అందరివాడు" ఒకటి. అది కేవలం శ్రీను వైట్ల దురదృష్టం, కొంచెం క్యాచీగా వుండే హీరోయిన్‌నీ పెడితే హిట్ అయిపోయి వుండేది. లేదా చిన్న చిరంజీవి పాత్ర ఒక కుర్ర హీరోతో చేయించినా ఇంకాస్త బాగుండేది. విషయానికి వస్తే అలా హిట్ అయిన సినిమాలన్నీ గొప్పవీ కావు,ఫ్లాపయిన సినిమాలన్నీ చెత్తవీ కావు. మొన్నీ మధ్య మేకింగ్ మీద కంటే ప్రమోషన్‌ల మీద ఎక్కువ దృష్టి పెట్టి కోట్లు కొల్లగొట్టేసిన వెంకటేష్ సినిమాలోని వెకిలి కామెడీ వెంకటేష్ స్టార్ స్టేటస్ కే మ్యాచ్ కాలేదు. ఆ డైరెక్టర్ ఇపుడు చిరంజీవితో తీస్తున్నాడు అంటే,ఆ సినిమా సూపర్ హిట్ అవ్వచ్చు కాక చిరంజీవి లెవెల్ రాజేంద్రప్రసాద్ లెవెల్‌కి దిగిపోవడం ఖాయం. పైగా డైరెక్టర్లను కూడా అలుపెరుగని వీరులు, ఫ్లాప్ ఎరుగని శూరులు అని పొగడడాలు తగ్గిస్తే తప్ప వాళ్లు మంచి సినిమాలు తీయలేరు. హిట్ అవ్వడం ఒకటే సినిమాకి కొలబద్ద కాదు, అందరివాడు సినిమాలోని గోవిందరాజులు పాత్ర టీవీలో కనపడితే కనీసం ఒక సీన్ అయినా చూడకుండా ఛానల్ మార్చలేడు ఎవడూ కూడా. చిరంజీవి రావిపూడి సినిమా హిట్ అవ్వకపో యినా ఏమీ ఫర్వాలేదు కానీ అతని స్థాయిని తగ్గించకుండా వుంటే అదే పదివేలు,అసలే చిరంజీవి ఈ మధ్య బైబిల్‌నీ బాగా ఫాలో అయ్యేవాడిలా హెచ్చింపబడడానికి తనకు తాను తగ్గించుకోవాలనుకుని రోజు రోజు కూ కాస్త కాస్త తగ్గించుకుంటూ పోతున్నాడు తన "అందరివాడు" ఇమేజ్ నీ.!!!

**- రఘు శ్రీమంతుల**





మనం రకరకాల పన్నులు కడుతూనే ఉంటాం. "పన్నుమీద పన్నున్నవారు ఇంటిమీద ఇల్లు కడతారు" అని సామెత కూడా ఉంది. ఈ సామెతలో నిజమెంతో కానీ ఇంటిమీద ఇల్లు కట్టిన ప్రతివాడూ ప్రభుత్వానికి పన్ను మీద పన్ను కట్టడం మాత్రం నిజం. పన్నులో అంతర్భాగంగా ఎడ్యుకేషన్‌సెస్, హెల్త్‌సెస్ లాంటి సమస మాజ నిర్మాణానికి అవసరమైన ఎన్నెన్నో ఉప పన్నులు జత అయి ఉంటాయి. చెవిలో జోరీగ.. చెప్పులో ముల్లు.. కంటిలో నలుసు, ఇంటిలో పోరు ఇంతింత కాదయా! అని వేమన బాధపడ్డాడు కానీ పంటికింద రాయిలాంటి పన్నుపోటు గురించి ఎందుకో పట్టించుకోలేదు. ఇప్పటి వ్యవహారాలు అప్పుడు ఉండి ఉంటే పన్నుపోటును కూడా ఇదే పద్యం లో కలిపి ఉండేవాడు. లేదా పన్నుపోటును కుళ్ళబొడుస్తూ లెక్కలేనన్ని ఆటవెలదులు రాసేవాడు. అయినా మన గొడవ పన్నుపోటు గురించి కాదు. ఆ పన్నులతో ప్రభుత్వాలు కనీసం గుంతల్లేని రోడ్లయినా మనకు వేసిపెట్టాల్సిన బాధ్యత గురించి. ఆపన్నులమైన మన గుండెలో గుంతలను పూడ్చేదెవరు? చింతలను తీర్చేదెవరు?

# సెల్ఫ్ హీలింగ్ తారుతో ఇక గుంతలు మాయం!

గుంతల రోడ్లమీద బైకులు, కార్లు, బస్సులు తమ మానాన తాము వెళుతూ ఉంటాయి. వాహనాలమీద, లోపల ఉన్నవారికి వెన్నెముకలు విరుగుతూ ఉంటాయి. చీకట్లో, వెలుగులో గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. గంట ప్రయాణం గతుకుల రోడ్డుమీద మూడు గంటలు దాటినా పూర్తవ్వదు. ఈలోపు పాడయ్యే వాహనాల రిపేరీ ఖర్చు, విరిగిన ఎముకలకు అతుకులు పెట్టుకునే ఖర్చులు పెరుగుతూనే ఉంటాయి.

రోడ్లమీద గుంతలు పడగానే ఆటోమేటిగ్గా రోడ్డే ఆ గుంతను పూడ్చుకునే సాంకేతిక వెసులుబాటు ఉంటే ఈ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుంది కదా! అని శాస్త్రవేత్తలు ఆలోచించారు. మొదట వినడానికి ఈ ఐడియా తమాషాగా ఉన్నా అనేక పదార్థాల మిశ్రమాలతో ప్రయోగాలు చేయగా.. చేయగా.. చివరికి





## గుంతల రోడ్లకు ఇక చెల్లు!

Courtesy: Namaste Telangana

### తనకు తాను మరమ్మతు చేసుకునే తారు అభివృద్ధి

న్యూఢిల్లీ: రోడ్లపై గుంతలు వాహన చోదకులకు చికాకు కలిగిస్తుంటాయి. వాటిని పూడ్చేందుకు భారీగా నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్ల మరమ్మతులను తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తిచేసేందుకు ఉపకరించే పదార్థాల తయారీపై బ్రిటన్ పరిశోధకులు దృష్టి సారించారు. ప్రత్యేకమైన 'సెల్ఫ్-హీలింగ్' తారును అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి బయోమాస్ వ్యర్థాలు, మొక్కల నుంచి సంగ్రహించిన సూక్ష్మ బీజాలతో దీన్ని రూపొందించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు, పగుళ్లను ఎవరి ప్రమేయం లేకుండా తనంతట తానే మరమ్మతు చేయడం ఈ తారు ప్రత్యేకత. స్వాన్సీ యూనివర్సిటీ, లండన్‌లోని కింగ్స్ కాలేజీ, చిలీ శాస్త్రవేత్తలు కలిసి ఈ తారును తయారు చేశారు. బ్రిటన్‌లో రోడ్ల మరమ్మతుల కోసం ఏటా 143.5 మిలియన్ పౌండ్లు (దాదాపు రూ.1,580 కోట్లు) ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ఇప్పుడు తాము రూపొందించిన తారు మరింత మన్నికైన 'నెట్-జీరో' రోడ్ల అభివృద్ధికి దోహదం చేస్తుందని స్వాన్సీ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం తెలిపింది.

జాతీయ రహదారులు నాలుగు వరుసలతో, ఆరు వరుసలతో చూడ్డానికి అందంగా, ప్రయాణానికి అనువుగా ఉంటాయి కానీ...టోల్ గేట్ల ద్వారా వాటి నిర్మాణానికి కొన్ని తరాలపాటు మన జేబుల్లోనుండి వడ్డీలు, చక్ర వడ్డీలు, లాభాలతో పాటు వసూలు చేసే లోగుట్లు, పెట్టుబడి రాబట్టినా కొనసాగే టోల్ గేట్ల దోపిడీలు తెలుసుకుంటే మన భవిష్యత్తు కూడా ముందే జాతీయాకరణ అయిన విషాదం తెలిసివస్తుంది. అందుకే మెడకాయమీద తలకాయ ఉన్నవారెవరూ ఆ లెక్కలు తెలుసుకోరు.

ఆర్ అండ్ బీ రోడ్లు, పంచాయతీ రోడ్లు స్థానిక ప్రజాప్రతినిధుల శక్తి సామర్థ్యాలను బట్టి ఉంటాయి. చాలా పంచాయతీల్లో తమ పరువు కాపాడుకోవడానికి సర్పంచ్‌లు చేతినుండి ఖర్చు పెట్టుకుని సిమెంటు రోడ్లు వేసి ఆ బిల్లులు ఏళ్ళు గడిచినా రాక నిరసన దీక్షలు, ర్యాలీలు చేస్తూ ఉంటారు. చేతినుండి ఖర్చు పెట్టుకునే స్థోమత లేని వారు ప్రభుత్వానికి అర్జీ కాగితాలు ఇస్తూ ఉంటారు. మరీ గుంతలు పాతాళం అంచులు తాకుతూ ఉంటే పక్కన మట్టి తవ్వి పూడుస్తూ ఉంటారు.

వేసిన తారు రోడ్లు వేసవి రాగానే ఎండ వేడికి కరిగి కన్నీరు కార్చినా గుంతలే తేలుతాయి. వర్షాకాలంలో నీటి నిలువకు, కోతకు గురైనా గుంతలే తేలుతాయి. రుతువు ఏదైనా గుంతలు కామన్. ఆ




అద్భుతం జరిగింది. "సెల్ఫ్ హీలింగ్ తారు" తయారయ్యింది. ప్రయోగాత్మకంగా పరీక్షించారు. చక్కటి ఫలితాలు వచ్చాయి.

కృత్రిమ మేధ సహకారంతో బయోమాస్ వ్యర్థాలు, మొక్కలనుండి సంగ్రహించిన సూక్ష్మ బీజాలతో ఈ వినూత్న పదార్థాన్ని లండన్ కింగ్స్ కాలేజీ, స్వాన్సీ యూనివర్సిటీ, చిలీ శాస్త్రవేత్తలు కలిసి ఆవిష్కరించారు. దీనితో ఖర్చు తక్కువ- ఫలితాలు ఎక్కువ అని తేలింది.

**బాబ్బాబూ!**

అర్జెంటుగా మెట్రిక్ టన్నులకు టన్నుల సెల్ఫ్ హీలింగ్ తారు తయారు చేసి లండన్ నుండి కార్గో షిప్ కంటెయినర్లలో క్షణం ఆలస్యం చేయకుండా ఇండియాకు ఎగుమతి చేయగలరు! ఇక్కడ మేము, మా ప్రభుత్వాలు గుంతల్లో కూరుకుపోయి బయటికి రాలేకపోతున్నాము. గుంతల రోడ్లమీద తిరగలేక చస్తున్నాము. గుంతలు పోయే రోజులకోసం గుంతలు పడ్డ కళ్ళతో ఎదురు చూస్తూ ఉన్నాము!

నిజంగానే ఇండియాకు ఈ తారు వచ్చిందనే అనుకుందాం. మన గుంతలో కాంట్రాక్టర్లు పడనిస్తారా? గుంతకాడ నక్కల్లాంటి అవినీతి తిమింగలాలు ఈ తారును వేయనిస్తాయా? వేసినా పనిచేయనిస్తారా? పనిచేయనిస్తే భారత్ కు వికసిత దారులు వచ్చినట్లే!

-పమిడికాల్వ మధుసూదన్

## పదవతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని కొయ్యాం జెడ్పిహెచ్ స్కూల్‌లో పదవతరగతి విద్యార్థులకు వెల్కమ్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష కిట్లను న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ డాక్టర్ మణికంఠ అందించి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి అత్యుత్తమ మార్కులతో మెరవాలని సూచించారు. గురువులు చెప్పిన సూచనలను పాటిస్తే అది కష్టసాధ్యం కాదన్నారు. పిల్లలను దృష్టిలో ఉంచుకొని సుమారు 101మంది పిల్లలకి పెన్నులు, అట్టలు ఇతరపరీక్ష సామాగ్రిని అందించామన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాసే పిల్లలకు ఉత్తేజం పెంచడం కోసం వెల్కమ్ సేవ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యటం హర్షణీయమన్నారు. వెల్కమ్ సేవ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం.తాతారావు, వైస్ ప్రెసిడెంట్ బి.మురళి మోహన్ ఆధ్వర్యంలో కొయ్యాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయానంద్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలాగే ఇక్కడి విద్యార్థులు ఐఐటిలో సిట్ సంపాదించిన ప్రతి ఒక్కరికి వెల్కమ్ సేవ ఫౌండేషన్ తరుపున రూ.2వేల బహుమతిగా అందించనున్నామన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు దయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తొందరపడకుండా ప్రతీ ప్రశ్నకు జవాబులు రాయాలని ఈ సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అప్పారావు, ధర్మారావు, లక్ష్మణరావు, గోవింద, రామకృష్ణ, శంకరరెడ్డి, మూర్తి, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాలేయ సమస్యపై నిర్లక్ష్యం వద్దు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక డే అండ్ నైట్ కూడలి వద్దగల ఆర్.ప్రశాంత్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రాంగణంలో గురువారం జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో కాలేయ సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైబ్రో స్కానింగ్ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు ఆర్.ప్రశాంత్ గ్యాస్ట్రోఎంటరాలజీ సహకారంతో కాలేయం సమస్యతో బాధపడుతున్న వారికి ఉచిత పరీక్షలు నిర్వహించామని, కాలేయ సమస్యపై నిర్లక్ష్యం తగదని జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ అన్నారు. అనంతరం వైద్యులు ఆర్.ప్రశాంత్ మాట్లాడుతూ హెపటైటిస్ లక్షణాలు కనిపించేటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని, ఐదు రకాల వైరస్‌ల వ్యాప్తి వల్ల కాలేయానికి ఇన్ఫెక్షన్ సోకుతుందని, లివర్ కేన్సర్ రావడానికి అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించి కలుషిత నీరు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. హెపటైటిస్ లక్షణాలు కనిపించేటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని, ఈ రోజు ఈ కార్యక్రమానికి కారకులైన కమ్యూనిటీ డెవలప్మెంట్ జోన్ డైరెక్టర్ జెఎఫ్‌జీ బి.దిలీప్ కుమార్‌కు, ప్రముఖ వైద్యులు ఆర్.ప్రశాంత్‌లకు ప్రత్యేక ధన్యవాదాలని జేసీఐ వ్యవస్థాపకులు డా.జామి బీమశంకర్ అన్నారు. కార్యక్రమంలో జోన్ కో-ఆర్డినేటర్ బి.వరలక్ష్మి, సెక్రటరీ టి.ఉషారాణి, ట్రెజరర్ బోడిగి మధు, జేసీ సభ్యులు మండవల్లి రవి, లావణ్య క్లినిక్ స్పెషలిస్ట్ బెజ్జం వినయ్, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పూడికతీత పనులు ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గం పరిధి కొత్తపేట, కాజీపేట కునుకుపేట పరిధిలో గల గెడ్డ పనులను గురువారం ప్రారంభించారు. టీడీపీ నగర బిసి సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనుల్లో అరసవిల్లి నీటిసంఘ అధ్యక్షులు గొలివి కృష్ణ, గొలివి రమణ, దామోదర్, గంగు రమణ, గెంజి వాసు, చల్ల లక్ష్మీనారాయణ, సాధు హేమసుందర్, గంగు రాజుల చేతులమీదుగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ఈ పనులను నిర్వహిస్తున్నామన్నారు. బట్టి పూడికతీత పనులు చేయడం ద్వారా పరిసర గ్రామాలైన కొత్తపేట, కిల్లిపాలెం, కునుకుపేట, కాజీపేట పరిధిలోగల రైతులకు సాగునీరు పొలాలకు చేరేందుకు వీలవుతుందన్నారు. ఎమ్మెల్యే విజయవాడలో శాసనసభ సమావేశాల్లో ఉన్నప్పటికీ ఇక్కడ పనులు ఆగకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారన్నారు.



## కిడ్నీ బాధిత మహిళకు రక్తదానం



(సత్యంన్యూస్, కవిటి)

కవిటి మండలం, కవిటి గ్రామానికి చెందిన బోయిడి బెహరా అనే 40ఏళ్ల మహిళ కిడ్నీ సమస్యతో టెక్కలి జిల్లా హాస్పిటల్‌కి వచ్చింది. వైద్య పరీక్షలు జరిపిన వైద్యులు ఆమె శరీరంలో రక్తం చాలా తక్కువ వుందని, ఏబి పోజటివ్ రక్తం ఎక్కించాలని సూచించారు. రక్తదానం చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో రక్త దాతల కోసం ఎదురుచూస్తున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం సేవా సంఘం వాళ్ళు వెంటనే స్పందించి టెక్కలి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఒక ప్యాకెట్ ఏబి పోజటివ్ రక్తంను అందించినట్లు అభయం యువజన సేవాసంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జోగి ఆదినారాయణ, రోగి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 'గ్రీష్మ'ంలో రాజకీయ వసంతం!

**(మొదటిపేజీ తరువాయి)**

తెల్లవారితే నామినేషన్లకు చివరి రోజనగా గ్రీష్మ పేరును ఖరారు చేశారు. దీంతో అత్తవారింట్లో ఉన్న గ్రీష్మ ఒకవైపు నుంచి, తల్లి ప్రతిభాభారతి మరోవైపు నుంచి హుటాహుటిన మంగళగిరి చేరుకొని పార్టీ బీ ఫారాలు తీసుకొని నామినేషన్‌కు సోము వీర్రాజు మాదిరిగానే చివరి నిమిషంలో వచ్చారు. ఈలోగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఫోన్ చేసి తాను అసెంబ్లీలోనే ఉన్నానని, గ్రీష్మ నామినేషన్‌కు హాజరవుతానని చెప్పి అలానే వచ్చారు కూడా. టీడీపీ తరఫున నామినేషన్లు వేసిన ఏ అభ్యర్థి తరఫునా రాని లోకేష్ గ్రీష్మ నామినేషన్‌కు రావడం జిల్లాలో సంచలనం రేపుతోంది. తెలుగుదేశానికి అనుకూలంగా ఉండే రెండు పత్రికల్లో కేబినెట్‌లో ఉన్న కొందరు మంత్రులపై వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. ఇది కాకుండా చంద్రబాబు సొంత ఇంటెలిజెన్సీ కూడా కొంతమంది సిట్టింగ్ మంత్రుల మీద రిపోర్టులు ఇచ్చింది. అలాగే మరికొందరి మీద అవినీతి ఆరోపణలు లేకపోయినా సమర్థవంతంగా శాఖను నిర్వహించలేకపోతున్నారన్న నివేదికలు కూడా ఉన్నాయి. వీటన్నిటినీ క్రోడీకరించి ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత ఉగాదికి మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయని పార్టీలో చర్చ నడుస్తోంది. గ్రీష్మ ఎమ్మెల్సీ స్థానంలోకి వస్తున్నా మంత్రుల స్థానాలకు ఢోకా లేదు కానీ, రాష్ట్రంలో ఎవరో ఒకరికి ముప్పు తప్పదు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 75 మంది మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లోకి అడుగు పెడతారని స్వయంగా చంద్రబాబే బుధవారం ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ రోస్టర్ కూడా మారనుంది. అదే సమయంలో ఎస్సీ నియోజకవర్గాలు కూడా పెరుగుతాయి. ముందుచూపుతో ఒక నాయకత్వాన్ని తయారుచేయడం కోసం ఎవరూ ఊహించని విధంగా గ్రీష్మను చంద్రబాబు తెర మీదకు తెచ్చారు. ఇది కేవలం ఎస్సీ, యువత, మహిళ కోటాలో గ్రీష్మకు దక్కిన అవకాశం. ప్రతిభాభారతికి ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేకుండా జిల్లా నుంచి బలోపేతం చేయాలన్న ఆలోచన కూడా పార్టీలో కనిపిస్తోంది. ఒంగోలులో జరిగిన మహానాడులో గ్రీష్మ ఇచ్చిన స్పీచ్ వివాదాస్పదం కావడమే ఆమెకు కలిసొచ్చిన అంశం. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మండలిలో వైకాపా తరఫున వరుదు కల్యాణి దృఢమైన వాయిస్‌ను వినిపిస్తున్నారు. మొన్నటికి మొన్న తెలుగుదేశం నాణ్యమైన మద్యాన్నే అందిస్తున్నామని భావిస్తే మద్యపానం ఆరోగ్యానికి హానికరం అనే లేబుల్‌ను తీసేయొచ్చు కదా.. అంటూ నేరుగా ఆమె సెటైర్ వేశారు. అంతేకాకుండా మండలిలో మహిళగా చాలా గట్టిగా ఆమె కౌంటర్ ఇస్తున్నారు. ఇప్పుడు ముల్లును ముల్లుతోనే తీయడం కోసం అదే మండలికి గ్రీష్మను పంపిస్తున్నారు.

## నాలుగోతరం నాయకురాలు గ్రీష్మ



ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ ఆ కుటుంబంలో నాలుగో తరం రాజకీయ నాయకురాలు. గ్రీష్మ ముత్తాత అంటే అమ్మమ్మ తండ్రి కావలి నారాయణ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలోనే శాసనసభ్యులు. ఆయన తర్వాత గ్రీష్మ తాత అంటే ప్రతిభాభారతి తండ్రి జస్టిస్ పున్నయ్య రెండుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఒకసారి ఏకగ్రీవం కూడా అయ్యారు. గ్రీష్మ పెద్ద తాత అంటే జస్టిస్ పున్నయ్య సోదరుడు కూడా శాసనసభ్యుడిగా ఉన్నారు. ఇక గ్రీష్మ తల్లి ప్రతిభాభారతి గురించి చెప్పవలసిన అవసరం లేదు. ఐదుసార్లు శాసనసభ్యురాలిగా, ఒకసారి మండలి సభ్యురాలిగా పనిచేశారు. చాలా చిన్న వయసులోనే ఎన్టీఆర్ మొదటి కేబినెట్లో మంత్రిగా ఉన్నారు. ఉమ్మడి ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొట్టమొదటి మహిళా స్పీకరుగా సేవలు అందించారు. బహుశా మొట్టమొదటి దళిత స్పీకర్ కూడానేమో. నాలుగో తరంలో గ్రీష్మకు మండలికి వెళ్లే అవకాశం కలిగింది. శ్రీకాకుళం జిల్లాలో ప్రతిభా భారతి కుటుంబానికి ఎంతో గౌరవం ఉంది.

## వీర్రాజు వెనుకా బాబు లౌక్యమే



కక్కొచ్చినా, కల్యాణమొచ్చినా, సీటొచ్చినా, పద వొచ్చినా ఆగదు కాక ఆగదు. ఏ నిమిషానికి ఎవరికి ఎందుకు సీటొస్తుందో ఎవరికీ తెలియదు. వీర్రాజుకు రెండోసారి కూటమి అధికారంలో సీటు ఎందుకు ఇచ్చారని చాలామంది టీడీపీ అభిమానులు గుర్రు మీద ఉన్నారు. 2018 తర్వాత ఆయన చంద్రబాబుని తీవ్రంగా విమర్శించారనేది వారి గుర్రుకి కారణం. కలిసి ఉన్నప్పుడు ఒకరి తప్పులు ఒకరికి కనపడవు. విడిపోయాక ఏమన్నా తప్పే. చంద్రబాబు, బాలయ్య, టీడీపీ నాయకులు పోటా పోటీగా మోదీని తిట్టలేదా!? కొలికపూడి శ్రీనివాసరావు విష్ణువర్ధన్ రెడ్డిని బహిరంగంగా చెప్పుతో కొట్టలేదా!? అయినా పొత్తు కుదిరింది కదా! ఇవన్నీ రాజకీయాల్లో సర్వసాధారణమే. రాజకీయం అంటేనే ఇది. రాజకీయాల్లో అదృష్టవంతుడిని ఎవరూ చెరపలేరు. వీర్రాజు అదృష్టవంతులు. విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ్, భాను ప్రకాష్ రెడ్డి వంటి ఎంతోమంది యువనాయకులు ఉన్నా రెండోసారి అవకాశం రావటం అంటే అదృష్టం ఉండాలి. ఇంతే కాదు.. ప్రజలు మరో ముఖ్య విషయం మరచిపోతున్నారు. 2014 ఎన్నికల ముందు బీజేపీ-టీడీపీ పొత్తు పొడవకముందే పవన్ కల్యాణుడిని మోదీ వద్దకు తీసుకుని వెళ్లింది వీర్రాజే. దేర్ ఆర్ ఆల్వేజ్ వీల్స్ విథిన్ వీల్స్ ఇన్ పాలిటిక్స్. ఇష్టం ఉన్నా లేకపోయినా రాజకీయాల్లో ఏడుపు కూడా నవ్వుతూనే ఏడవాలి. అందుకే అన్నారు. నవ్వుతూ బతకాలిరా తమ్ముడూ.. ఏడుపుని కూడా నవ్వుతూ ఏడవాలిరా అని. గుడ్‌లక్ వీర్రాజూ.

# శ్రీ రాధాగోవిందా మందిరాన్ని దర్శించుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి



**సత్యంన్యూస్, రణస్థలం**

విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కోష్ట గ్రామంలోని గోశాల, శ్రీ రాధా గోవింద మందిరాన్ని సందర్శించారు. శ్రీ రాధాకృష్ణుల ఆశీర్వాదం తీసుకొని, ఆశ్రమం వద్ద గోశాలలోని గోమాతలను పూజించారు. అనంతరం ఇటీవల ఎంపీ తీసుకున్న నిర్ణయంపై, మూడవ సంతానం మగబిడ్డ కలిగినవారికి గోవును ఇచ్చే కార్యక్రమం మొదటిగా శ్రీ రాధా గోవింద మందిరం, గోశాల నుంచి ప్రారంభించబడుతుందని తెలిపారు. అలాగే గో-సంరక్షణ, గో-సేవ ప్రాముఖ్యతను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు.



# కలగ శ్రీనుపై విద్యుత్ సిబ్బంది ఫిర్యాదు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**

విద్యుత్ బిల్లు చెల్లించమని అడిగినందుకు పెద్దపాడుకు చెందిన టీడీపీ నేత కలగ శ్రీనివాసరావు దాడిచేయడంతో అతనిపై యూనియన్ నాయకులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీ-2 బలగ సెక్షన్ పరిధిలోని పెద్దపాడు పరిసరాల్లో కలగ శ్రీనుకు చెందిన నాలుగు విద్యుత్ సర్వీసులకు సంబంధించి గత నవంబరు నుంచి సుమారు రూ.15వేలు వరకు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డి-లిస్టులో ఉన్న ఈ సర్వీసులు నిలుపుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ముందుగా వినియోగదారునికి సమాచారం ఇవ్వడానికి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లిబాబు, లైన్‌మెన్ ఎం.భాస్కరరావు, జేఎల్‌ఎంలు కె.చలపతిరావు, జి.హరికృష్ణల బృందం తంగివానిపేట రోడ్డులో ఒక నిర్మాణం వద్ద ఉన్న కలగ శ్రీనివాసరావును కలిసి వివరించిన నేపథ్యంలో ఆయన కోపంగా సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను చెంపదెబ్బ కొట్టారు. ఈ దాడిని 1104 యూనియన్ తరఫున టీవీ సుబ్రహ్మణ్యం, తెలుగునాడు యూనియన్ తరఫున కె.శ్రీనివాసరావు ఖండిస్తూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన సమయంలో ఏడీ-2 కె.శ్రీరామ్, సబ్ ఇంజినీర్ ప్రసాద్ కూడా ఉన్నారు.

# హాల్‌టికెట్ల పేరుతో విద్యార్థులను వేధిస్తే చర్యలకు సిద్ధం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఈ నెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్న నెపంతో జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు, స్టాంపులు ఉండాల్సిందేనన్న నిబంధనలు పెట్టి విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుంటున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. స్కూల్ యాజమాన్యాలు ఫీజులపై ఈ సమయంలో ఒత్తిడి పెంచడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు సూచనలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ల జారీ ప్రక్రియ మొదలుపెట్టిందని గుర్తు చేశారు. ఈ హాల్ టికెట్లతో నేరుగా జిల్లాలోని విద్యార్థులు నిరభ్యంతరంగా పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయవచ్చన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ హాల్‌టికెట్ల జారీపై తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రచార, ప్రసార సాధనాలు ద్వారా విస్తృతపరచాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. హాల్‌టికెట్ల జారీ పేరుతో యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే తమ కమిషన్ చట్ట ప్రకార చర్యలతో పాటు ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీతారాం చెప్పారు. సమస్యలుంటే apscpcr2018@gmail.com ఫిర్యాదులు చేయవచ్చని సీతారాం చెప్పారు.

# జగన్నాథునికి శఠగోపం

- దేవునికి నైవేద్యం కరువు
- కౌలురైతుల నుంచి ఏడాదికి లక్షల్లో ఆదాయం
- ప్రభుత్వానికి లెక్కచూపకుండా కైంకర్యం?
- ఆక్రమణలో ఆలయ భూములు
- ఆలయ ఆవరణలో చికెన్ సెంటర్ తొలగించని అధికారులు
- పట్టించుకోపోతే ధర్నా చేస్తాం
- హెచ్చరించిన పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యులు



**(సత్యంన్యూస్, మందస)**

సాబకోట పంచాయతీ కేంద్రంలోని జగన్నాథస్వామి ఆలయానికి విలువైన మాన్యాలు ఉన్నా దేవునికి నైవేద్యం కరువైందని, ఆలయ అభివృద్ధి కోసం దేవదాయ ధర్మాదాయ శాఖ పట్టించుకోక ఆలయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యులు మగత బెహరా, మదన్మోహన్ బెహరా, పురుషోత్తం బెహరా, బాలరాజు, పాండవ గణేష్, రత్నాల నీలాంబరు, కొండ దీనబంధు, నాగ రాజేష్, జగదీష్ బిసాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన పలు విషయాలు వెల్లడించారు. ఆలయానికి సుమారు 25 ఎకరాల పల్లపు భూములు ఉన్నాయని, ఏడాదికి లక్షల్లో ఆదాయం కౌలురైతుల నుంచి దేవదాయ శాఖ పొందుతుందని తెలిపారు. కానీ ఆలయానికి అర్చకులు లేరని, ధూప దీప నైవేద్యాలు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు ఆరాధ్య దైవమైన జగన్నాథుని ఆలయం తెరవకపోవడం, ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని వారు తెలిపారు. ప్రతి ఏటా రథయాత్ర ఉత్సవాలు జరపాల్సిన దేవదాయ శాఖ నిర్వహించకుండా, దేవదాయ శాఖ అధికారి బంధువులు నిధులను విత్ డ్రా చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. మందస దేవాలయ శాఖ కార్యాలయం కూడా సక్రమంగా తెరవడం లేదని, ఈ సమస్యపై వివరాలు అడగడానికి కార్యాలయానికి వెళ్తుంటే కార్యాలయ తలుపులు తెరుచుకోవడం లేదని తెలిపారు. ఆలయ సమస్యలు, ఆలయ ప్రాంగణంలో చికెన్ సెంటర్ తొలగింపుపై జిల్లా దేవదాయ శాఖ కార్యాలయానికి వెళ్లినా అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఆలయ ఆదాయ వివరాలు ఇవ్వాలని కోరినా నిరాకరిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆదాయ వనరులు ప్రభుత్వానికి లెక్కచూపకుండా కైంకర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని, ఆలయ నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే మందస దేవదాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


# పేరు మార్చడమైనది

**గేదెల చిన్నమ్మలు** W/o మొయ్యిల రామస్వామితో కొన్నేళ్ల క్రితం వివాహమైనది. గేదెల చిన్నమ్మలు పేరు మీదున శ్రీకాకుళం రూరల్ మండలం, గూడెం గ్రామం, గూడెం బ్రాంచ్ పోస్టాఫీసులో **R-AP-VP-EA-401276** పాలసీ కలదు. మొయ్యిల చిన్నమ్మడు W/o మొయ్యిల రామస్వామిగా పేరు మార్చడమైనది. ఇక నుండి బ్యాంక్ లావాదేవీలు, పోస్టల్, ఇతరత్రా ఆస్తి వ్యవహారాలకు ఈ పేరును వినియోగించుకుంటున్నామని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నాం

**ఇట్లు**

**మొయ్యిల చిన్నమ్మడు**

W/o మొయ్యిల రామస్వామి

గూడెం పోస్టు, గూడెం గ్రామం,

శ్రీకాకుళం రూరల్ మండలం,

శ్రీకాకుళం జిల్లా - 532 484


## వికలాంగ ఉపాధ్యాయులకు బదిలీల్లో మినహాయింపు ఇవ్వండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ చట్టం - 2025' ముసాయిదాను పాఠశాల విద్యాశాఖ రూపొందించిందని, కానీ వికలాంగ ఉపాధ్యాయులకు బదిలీల్లో ఎటువంటి మినహాయింపు ఇవ్వలేదని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, దివ్యాంగుల ప్రతినిధి చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో 75 శాతం పైబడిన వైకల్యం కలిగినవారికి, బదిలీల్లో మినహాయింపు ఇచ్చారని, ప్రస్తుత ముసాయిదా చట్టంలో 80 శాతం పైబడిన వైకల్యం కలవారికి, ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చేర్చారని, అయితే బదిలీల్లో మినహాయింపు ఇవ్వలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల అసోషియేషన్ అభ్యర్థన మేరకు బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు చల్లా వెంకటేశ్వర రావు తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.